# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

❖ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక అతిథిలుగా పాల్గొనేందుకు 210 మంది పంచాయతీ ప్రతినిధులకు ఆహ్వానం లభించింది.

❖ భారత్ - సింగపూర్ దేశాల మధ్య మంత్రివర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది.

❖ భారత ఎగుమతులపై ఇటీవల అమెరికా విధించిన సుంకాల ప్రభావం స్వల్పకాలికంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుడు వి. అనంత నాగేశ్వరన్ తెలిపారు.

❖ తెలంగాణలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

==========================

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగం ఆకాశవాణి నెట్‌వర్క్ అన్ని ఛానెల్స్ తో పాటూ దూరదర్శన్ కేంద్రాల్లోనూ రేపు సాయంత్రం 7 గంటల నుండి ప్రసారమవుతుంది. అనంతరం ఇంగ్లీష్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి అనువాదం వెలువడుతుంది. ఇక ఆకాశవాణి ప్రాంతీయ నెట్ వర్క్ ద్వారా రాత్రి 9 గంటల 30 నిమిషాలకు రాష్ట్రపతి ప్రసంగానికి ప్రాంతీయ భాషల్లో అనువాదం ప్రసారమవుతుంది.

==========================

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించే వేడుకల్లో ప్రత్యేక అతిథిలుగా పాల్గొనేందుకు 28 రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 210 మంది పంచాయతీ ప్రతినిధులకు ఆహ్వానం అందింది. తమ జీవన భాగస్వాములు, నోడల్ అధికారులతో సహా మొత్తం 425 మంది ఈ వేడుకలకు

హాజరుకానున్నారు. ఈ ప్రత్యేక అతిథులకు ఒక రోజు ముందుగా ఆగస్టు 14న న్యూఢిల్లీలో ఒక సత్కార కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. తమ తమ గ్రామ పంచాయతీలలో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడం, ప్రజలకు విస్తృతమైన సేవలను అందించడంతో పాటు సమాజంలో అన్ని వర్గాల వారిని కలుపుకొని ముందుకు వెళ్లే కార్యక్రమాలను అమలు చేయడంలో ఈ పంచాయతీ ప్రతినిధులు విజయవంతమవడంతో ఈ ఆహ్వానం లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత మువ్వన్నెల జెండా మన దేశానికి గర్వకారణమని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. లక్షలాది మంది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని వారు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఈ రోజును ఉత్సాహంగా జరుపుకుందాం. భోపాల్ లోని ఆయన నివాసంపై కుటుంబసభ్యులతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఈ సంవత్సరం పండుగలా జరుపుకుందామని శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ…

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - సింగపూర్ దేశాల మధ్య మంత్రివర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది. ఈ మూడవ విడత రౌండ్ టేబుల్ సమావేశానికి భారత మంత్రివర్గ బృందానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వం వహించగా సింగపూర్ నుండి వచ్చిన ప్రతినిధి బృందానికి సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి గేన్ కిమ్ యంగ్ నాయకత్వం వహించారు. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్, వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్, రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ లు కూడా హాజరయ్యారు. భారతదేశం-సింగపూర్ దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి వారు చేస్తున్న కృషికి విదేశాంగ మంత్రి డాక్టర్ జైశంకర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశం ఫలప్రదంగా సాగిందని జైశంకర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఎగుమతులపై ఇటీవల అమెరికా విధించిన సుంకాల ప్రభావం స్వల్పకాలికంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుడు వి.అనంత నాగేశ్వరన్ తెలిపారు. ఒకటి, రెండు త్రైమాసికాల్లో ఈ ప్రభావం తగ్గుతుందని స్పష్టం చేశారు. ఈరోజు ఆయన ముంబైలో పాత్రికేయులతో మాట్లాడుతూ… వస్త్రాలు, ఆభరణాలు, రొయ్యల ఎగుమతులకు సంబంధించిన రంగాలు ఈ ప్రారంభ భారాన్ని ఎదుర్కొంటాయని కానీ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం పరిమితంగానే ఉంటుందని చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“హర్ ఘర్ తిరంగ” కార్యక్రమంలో భాగంగా కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో ఈరోజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో ఆ చిత్రాలను పంచుకున్నారు. హర్ ఘర్ తిరంగ ప్రచార కార్యక్రమం నేడు ఒక ప్రజా ఉద్యమంగా మారిందని, దేశభక్తి భావనను బలపరచడంతో పాటు ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకురావడంలో సఫలీకృతమయ్యిందన్నారు. త్యాగం, తపస్సు, అంకితభావంతో ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు స్వతంత్ర భారతదేశాన్ని ఆవిష్కరించాలన్న కలను నిజం చేశారని ఈ సందర్భంగా అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి ఈరోజు న్యూఢిల్లీలో భారత్ స్టీల్ అధికారిక లోగో, వెబ్‌సైట్‌లను ఆవిష్కరించారు. ద్వితీయ ఉక్కు రంగానికి సంబంధించిన ఒక కార్యశాలలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. భారత్ స్టీల్ అనేది ఉక్కు మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఒక అంతర్జాతీయ ఎగ్జిబిషన్. ఇది వచ్చే సంవత్సరం న్యూఢిల్లీలో జరగనుంది. ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, పెట్టుబడిదారులను ఒకచోట చేర్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు 29 తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తోందని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ తెలిపారు. ఢిల్లీలో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, టీకాలు వేయడంపై జస్టిస్ జె.కె.మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం జారీ చేసిన 2024 నాటి సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఒక న్యాయవాది ప్రస్తావిస్తూ.. దాఖలు చేసిన పిటిషన్‌పై బి.ఆర్.గవాయ్ విచారణ చేపట్టారు. రాజ్యాంగ విలువలకు అనుగుణంగా అన్ని జీవుల పట్ల కరుణతో ఉండాలని ధర్మాసనం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఢిల్లీ అంతటా ఉన్న వీధి కుక్కలను పట్టుకొని వాటిని షెల్టర్లకు తరలించాలని జస్టిస్ జె.బి.పార్దివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీ.ఆర్.గవాయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పింఛనుదారుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో నవంబరు 1 నుండి 30వ తేదీ వరకు జాతీయ స్థాయి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) నమోదు కార్యక్రమం జరగనుంది. దేశవ్యాప్తంగా 1,850 కి పైగా జిల్లాలు, నగరాలు, పట్టణాల్లో ఈ శిబిరాలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. ముఖ ప్రామాణీకరణ సాంకేతికతను ఉపయోగించి పింఛనుదారులకు డిజిటల్ సాధికారతను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం రెండు కోట్ల డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను నమోదు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 17 వరకూ మధ్యప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌గఢ్, కోస్తాంధ్రలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. ఇక తెలంగాణలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో తీవ్ర ప్రమాద హెచ్చరికలు చేశామని ఐఎండి శాస్త్రవేత్త డాక్టర్ రఘు వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =